క్లుప్తంగా

ఘనంగా ఎన్‌సీసీ డే



మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ సర్జన్ కమాండర్ పాండా

సీతంపేట : స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 4(ఎ) నేవీ మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ సర్జన్ కమాండర్ పాండా, ఏఎన్‌వోలు లెఫ్టినెంట్ లక్ష్మణబాబు, లెఫ్టినెంట్ రమా గోస్వామి పాల్గొని సాయుధ దళాల్లో ఉన్న అవకాశాలు, ఎన్‌సీసీ ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో కళాశాలలో శిక్షణ పొందుతున్న 130 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

విద్యుద్దీప కాంతుల్లో శివాలయాలు



గణేష్ నగర్‌లో సుందరంగా అలంకరించిన శివాలయం

సీతమ్మధార : కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో పూజల కోసం ఉత్తర నియోజకవర్గంలో గల శివాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పలు రకాల పువ్వులతో ముస్తాబు చేశారు. నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా వనసమారాధన



వనసమారాధనలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు

మురళీనగర్ : మురళీనగర్ వాసులు, ముఖ్యంగా వైశాఖి స్పోర్ట్సు పార్కు సభ్యులు కార్తీక భోజనాల్లో భాగంగా ఈ ఏడాది కంబాల కొండ ట్రెకింగ్‌తోపాటు వనసమారాధనకు ఆదివారం వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక, కళారూపాలను ప్రదర్శించడమే కాకుండా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వీరు తమ స్నేహానికి గుర్తుగా ఓ చిత్రాన్ని తీసుకున్నారు. అనంతరం పాల్గొన్న వారికి పర్యావరణ హిత సంచులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్ : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్‌లోని బాలభాను విద్యాలయంలో మురళీనగర్ భజన మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ''దేవుడే స్నేహితుడైతే'' అంశంపై నిర్వహించిన పోటీలో 57 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి బాబా సమితి మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, బాలభాను విద్యాలయం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదికలు.. వేడుకలు

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఎదురు చూడకుండా అందుబాటులో ఉన్న వనరులు, దాతల సాయాన్ని ఉపయోగించుకుని ప్రజలకు అవసరమైన సదుపాయాలు సమకూర్చుకో వచ్చని మురళీనగర్ వాసులు నిరూపించారు. ప్రభుత్వాలే అన్నీ చేయలేవు. పార్కులను నిర్మించి ఇవ్వగలవు తప్ప అందులో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలంటే నిధుల కొరత సర్వసాధారణం. అందుకే మురళీనగర్‌లోని పార్కుల నిర్వాహకులు ముఖ్యమైన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకోవడం కోసం దాతల సాయంతో వేదికలు నిర్మించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో పని లేకుండానే స్థానికులు వివిధ శుభకార్యాలు, సమావేశాల నిర్వహణకు ఉపయోగపడేలా లక్షలాది రూపాయలతో నిర్మించారు. ఇవి వివిధ ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడుతున్నాయి.

– మురళీనగర్



సుదర్శన్ పార్కులో ధ్యాన మందిరం



బృందావన్ పార్కులోని కళావేదిక

- మురళీనగర్‌లో దాతల సాయంతో నిర్మాణం
- పండగలు, శుభకార్యాలకు వినియోగం

వైశాఖి స్పోర్ట్సు పార్కులో...

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో వైశాఖి కళావేదికను వేములపల్లి కళా క్షేత్రం పేరుతో నిర్మించారు. వేములపల్లి పూర్ణచంద్రరావు ఆయన తాతయ్య జాస్తి బూసయ్య, అమ్మమ్మ రాఘవమ్మ జ్ఞాపకార్థం రూ.5 లక్షల విరాళంతో దీన్ని నిర్మించారు. ఏటా ఇక్కడ జనవరిలో సకుటుంబ సపరివారంగా భోగి సంబరాలు నిర్వహిస్తారు. మురళీనగర్, మాధవధారకు చెందిన వందలాది కుటుంబాలు పాల్గొని పల్లె వాతావరణాన్ని తలపించే విధంగా ఉత్సవాలు జరుపుతారు. శ్రీరామనవమి సందర్భంగా వసంత నవరాత్రులు, డిసెంబరు 31న ఉత్సవాలు, ఉగాదినాడు పంచాంగ శ్రవణం, శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్టి ఉత్సవం, దసరా సందర్భంగా మార్వాడీ ఉత్సవాలు నిర్వహిస్తారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



వైశాఖి స్పోర్ట్సు పార్కులో వేములపల్లి కళాక్షేత్రం

ఇతర పార్కుల్లోనూ...

సుదర్శన్ పార్కులో వేములపల్లి పూర్ణచంద్రరావు తన తల్లిదండ్రులు వేములపల్లి రాజబాబయ్య, సుందరమ్మ పేరు మీద రూ.2.5 లక్షలతో ధ్యాన మందిరం నిర్మించారు. ఇక్కడ నిత్యం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బృందావన్ పార్కులో దాసరి సాయిబాబు అందించిన విరాళాలతో నిర్మించారు. వాకర్స్‌పార్కులో సభావేదికను బోకం శ్రీనివాసరావు అందించిన 1.50 లక్షలతో నిర్మించారు. సీలింగ్‌కు డాక్టర్ బాబూరావు రూ.25 వేలు అందించారు. ఇక్కడ నిత్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికి అనుబంధంగా ప్రాంగణం నిర్మించారు. దీని విస్తరణకు రూ.లక్ష ఖర్చు చేశారు. బుచ్చయ్య, పల్లా చంద్రమౌళి దీన్ని ఇటీవల ప్రారంభించారు. శ్రీదేవి పార్కులో విరాళాలతో వేదికను నిర్మించారు. హరిత పార్కులో స్థానికులు అందించిన విరాళాలతో తిప్పారెడ్డి కళాక్షేత్రాన్ని రూ.2.50 లక్షలతో నిర్మించారు.



హరిత పార్కులో తిప్పారెడ్డి కళావేదిక



ప్రశాంతి పార్కులో వివేకానంద ఆధ్యాత్మిక మందిరం

ప్రశాంతి పార్కులో ఆధ్యాత్మిక మందిరం

మురళీనగర్ సెక్టార్ – 3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో నిర్మించిన ఆధ్యాత్మిక మందిరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడుతోంది. వివేకానంద ఆధ్మాత్మిక మందిరం పేరుతో దీన్ని రూ.10 లక్షలతో నిర్మించారు. వివేకానంద యువ మహామండలి, స్థానిక పార్కు నిర్వాహకుల పర్యవేక్షణలో దాతల సాయంతో నిర్మించారు. వ్యాసం శ్రీరామమూర్తి నాయుడు, లక్ష్మీనారాయణ కృషితో ఇది ఒక రూపు సంతరించుకుంది. జీవీఎంసీ కేటాయించాల్సిన నిధులు నేటికి పదేళ్లు దాటినా మంజూరు చేయలేదు. ఇక్కడ ప్రతీ ఆదివారం వివేకానందుడి రచనలపై అధ్యయనంతో పాటు, యువకులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం వ్యాయామం, యోగా నిర్వహిస్తున్నారు. కార్తీక సోమవారాలు, ముఖ్యమైన పర్వదినాల్లో పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా ఎస్ఐ శ్రీను

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీను హెచ్చరించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి షాపుల వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల రోజువారీ కార్యకలాపాలపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

30న గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

మహారాణిపేట : రామా టాకీస్ సమీపంలో ఉన్న యాసీన్ మసీద్ ఆధ్వర్యంలో దారుల్ ఉలూమ్ హాబిబుల్లా రజా–ఎ–ముస్తఫా మదర్సా సమక్షంలో అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 30న గ్యార్వీ షరీఫ్ ఉత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్యార్వీ షరీఫ్ వేడుకలకు ఉత్తరప్రదేశ్ నుంచి ముస్లిం మత గురువు సయ్యద్ సాబాత్ హుస్సేన్ సాహెబ్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వేడుకలకు ఏసీపీ కె.లక్ష్మణమూర్తిని ఆహ్వానిస్తూ పత్రిక ఆదివారం అందజేశారు. యాసీన్ మసీదు అధ్యక్షుడు ఖాజీ మొహమ్మద్ అహమదుల్లా ఖాన్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, దేవరకొండ మార్కండేయులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ



వాకర్స్ క్లబ్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్ : క్యాన్సర్ లక్షణాలు ముందుగా గుర్తించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని క్యాన్సర్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ వంశీధర్ పుట్రేవు సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్రింధా ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన వైద్య సలహాలు అందించారు. క్యాన్సర్ లక్షణాలకు సంబంధించి ముందస్తు పరీక్షలు చాలా కీలకమని చెప్పారు. సకాలంలో వైద్యం పొందాలన్నారు. క్యాన్సర్ చికిత్స విధానాలను జనరల్ మెడిసిన్ అంకాలజిస్టు డాక్టర్ పి.విజయలక్ష్మి, ఎముకల వ్యాధుల నివారణ మార్గాలను ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ వి.అచ్యుత రమేష్, చలికాలంలో వ్యాధుల వ్యాప్తికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎస్.సంజన వివరించారు. వైద్య శిబిరంలో 193 మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 63 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వారాజు, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, టి.వి.రమణ, వడ్డాది అప్పారావు, సబ్బినేని రామమోహన్ రావు, సూర్రెడ్డి శ్రీనివాసరావు శిబిరం నిర్వహణకు సహకరించారు.

రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజలకు రక్షణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సీతంపేట : రాజ్యాంగాన్ని రక్షించుకున్నప్పుడే ప్రజలను రక్షించుకున్నట్టని పలువురు మేధావులు స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ప్రజా సంక్షేమం'పై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.హరగోపాల్, దుప్పలపూడి రవికుమార్, డాక్టర్ సుదర్శన్, గూడూరు సీతామహాలక్ష్మి, రత్నకుమారి, వి.వి.రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారని తెలిపారు. అగ్ర కులాల చేతుల్లో అధికారం ఉండటం వల్ల రాజ్యాంగంలోని అన్ని అంశాలు అమలు కావడం లేదన్నారు. మతోన్మాదం తీవ్రతరం అవుతోందని, మరోవైపు పరిశ్రమలు ప్రైవేటీకరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర జరుగుతోందని, కాపాడుకోవడానికి బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కేబీఆర్ అంబేడ్కర్, బూసి వెంకటరావు, బర్రె అప్పారావు, చింతాడ సూర్యం, బొడ్డు కల్యాణ రావు, కొత్తపల్లి వెంకటరమణ, పతివాడ రాంబాబు, ఏఎస్సార్ వేమన పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రచురణలతో విజ్ఞానం

సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

మహారాణిపేట: విశాలాంధ్ర ప్రచురణలతో జ్ఞానం.. విజ్ఞానం సముపార్జించుకోవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. ఆదివారం టర్నర్ సత్రంలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో పుస్తక ప్రదర్శనను విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ముందుగా పుస్తక ప్రదర్శనకు విచ్చేసిన రాజుకు నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను వీక్షించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ మంచి పుస్తకాలు దొరికే చోటు విశాలాంధ్ర అని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలతో అందరికీ విజ్ఞానం చేరువవుతుందన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో అనేక పుస్తకాలు ఒకే చోట లభ్యం కావడం అభినందనీయమన్నారు. అంకితభావంతో విశాలాంధ్ర నేటికీ అనేక ప్రాంతాల్లో పుస్తక ప్రదర్శనలు పెట్టి, పుస్తక ప్రియులకు ఎనలేని సేవ చేస్తుందని కొనియాడారు. పుస్తకాలకు ఆదరణ తగ్గలేదని చాటి చెప్పేలా విశాలాంధ్ర చేస్తున్న కృషి మెచ్చదగ్గది అన్నారు. సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావును రాజు అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలు ప్రదర్శనగా ఉంచి ప్రజలకు మరింత చేరువ చేయాలని విశాలాంధ్ర కృషి చేస్తుందని తెలిపారు. విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు రాష్ట్రంలో ఆదరణ తగ్గలేదన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, అరసం కార్యదర్శి సీఎస్ క్షేత్రపాల్, సభ్యులు బొట్టా అప్పారావు, విశాలాంధ్ర దినపత్రిక విశాఖ ఎడిషన్ మేనేజర్ సనపల నరసింహులు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పీఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి, హారతి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, సంస్థ సభ్యులు పర్యవేక్షించారు.

పారిశ్రామిక కాలుష్యంతోనే విశాఖకు ముప్పు



పుస్తకం ఆవిష్కరిస్తున్న పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి, తదితరులు

సీతంపేట : పారిశ్రామిక కాలుష్యం విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మానవ హక్కుల వేదిక 9వ మహాసభల్లో ఆయన విశాఖలో పర్యావరణ విధ్వంసంపై ప్రసంగించారు. పరిశ్రమల కాలుష్యం, సీవేజ్ వ్యర్థాలు, పోర్టు కాలుష్యం, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వ్యర్థాలు విశాఖలో కాలుష్యానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. విశాఖ పోర్టు, గంగవరం పోర్టు నుంచి వస్తున్న బొగ్గు, ధూళి చాలా ప్రాంతాలకు విస్తరించి కాలుష్యం బారిన పడేస్తున్నాయన్నారు. పోర్టులో కోల్ డంపింగ్ వద్ద కాలుష్య నివారణ చర్యలు సక్రమంగా తీసుకోకపోవడంతో దుమ్ము, ధూళి వ్యాపిస్తున్నాయన్నారు. కోల్ డింపింగ్స్‌ను కవర్స్‌తో పూర్తిగా కప్పాలని, వాటరింగ్ చేయాలని నేషనల్ ట్రిబ్యునల్ చెప్పినా అమలు చేయడం లేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రమాదకరమైన, అత్యంత ప్రమాదకరమైన జాబితాలో 386 పరిశ్రమలు ఉన్నాయని కాగ్ నివేదికలో పేర్కొన్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో ప్రమాదకర పరిశ్రమలకు పీసీబీ 110 నోటీసులు జారీ చేసిందన్నారు. కాలుష్యాన్ని గరిష్టంగా వెదజల్లే ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ, హెచ్‌పీసీఎల్, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదన్నారు. చిన్న పరిశ్రమలపైనే పీసీబీ ప్రతాపం చూపిస్తోందన్నారు. కాలుష్యం కారణంగా అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నా కాలుష్య నియంత్రణాధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1380 రోజులుగా కార్మికులు, ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షురాలు కె.అనురాధ పారిశ్రామిక కాలుష్యంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ల పంపిణీ



జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న కంచర్ల అచ్యుతరావు, తదితరులు

సీతంపేట : రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ కల్పించేందుకు జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్టు ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జర్నలిస్టులకు ఆదివారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు తన శక్తి మేరకు సాయం అందిస్తానని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ డిసెంబరు 8న శివాజీపార్కులో జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా వన సమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు



ప్రమాదకరంగా తయారైన రోడ్డు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల సాయిబాబా గుడి ముందు రోడ్డు ప్రమాదకరంగా తయారవడంతో స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి బాలయ్యశాస్త్రి లే అవుట్‌కి వెళ్లే రోడ్డులో కాలువ మీద కల్వర్టు పూర్తి స్థాయిలో లేకపోవడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 20 కార్ల టైర్లు ఈ గోతిలో దిగిపోవడం గమనార్హం. రోడ్డు మీద మలుపు తిరిగే సమయంలో రోడ్డు పక్కన గల కాలువ కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పాదచారులు కూడా రోడ్డుపై వాహనాలు వచ్చేటపుడు ఎడమవైపు పక్కకి తప్పుకునే క్రమంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా కాలువలో పడిపోవడం ఖాయమని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, కాలువ మీద కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా కాలువలు



స్వీపర్ కాలనీలో శిథిలావస్థలో ఉన్న కాలువలు

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి స్వీపర్ కాలనీ కొండవాలు ప్రాంతంలో కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలనీలోని ప్రతీ వీధిలో కాలువల్లో కాంక్రీట్ పైకి తేలిపోవడంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో కాలువలు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులు ప్రారంభించ లేదు. దీంతో కాలనీలో పరిసరాలు అధ్వానంగా మారాయని, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు కాంక్రీట్ కాలువలు నిర్మించమని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోనల్ అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యులు



జయమ్మను కుమారుడికి అప్పగిస్తున్న జ్యోతిర్మయి, కానిస్టేబుల్ ప్రకాశరావు

సీతమ్మధార: పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు గ్రామానికి చెందిన పలివెల జయమ్మ (62) మానసిక ఆరోగ్యం సరిగా లేక, ఎవరో తరుముతున్నారంటూ ఇంట్లో చెప్పా పెట్టకుండా వైజాగ్ వచ్చేసింది. ద్వారకనగర్ రోడ్డులో తిరుగుతుంటే పోలీసులు చూసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు టీఎస్ఆర్ మహిళా షెల్టర్‌లో ఆమెను చేర్పించారు. ఆమె దగ్గర కుమారుడి ఫోన్ నంబర్ తీసుకుని సమాచారం అందజేయడంతో ఆమె కుమారుడు పలివెల శ్రీను షెల్టర్‌కు వచ్చారు. మేనేజర్ జ్యోతిర్మయి, ద్వారక కానిస్టేబుల్ ప్రకాశరావు సమక్షంలో జయమ్మను కుమారుడు శ్రీనుకు ఆదివారం అప్పగించారు.

టీఎస్ఆర్ షెల్టర్‌కు తిరుపతిరావు..

మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన జంగేటి తిరుపతిరావు (61) కాంప్లెక్స్‌లో తిరుగుతుంటే ద్వారకా పోలీసులు ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు టీఎస్ఆర్ షెల్టర్‌లో తిరుపతిరావుకు వసతి కల్పించారు. తిరుపతిరావు వ్యసనాలకు బానిసై ఇల్లు వదిలి విశాఖ వచ్చేశాడు. కుటుంబ సభ్యులను రప్పించి ఆదివారం అతన్ని అప్పగించారు.